క్లుప్తంగా

రేపు ప్రజా ఫిర్యాదులు, పరిష్కార కార్యక్రమం

గన్నవరం: స్థానిక శ్రీనివాస హేచరీస్ సమీపంలోని ఎస్ఎం కన్వెన్షన్ హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదులు, పరిష్కార(మీ కోసం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. సామాజిక, వ్యక్తిగత ఫిర్యాదుల పరిష్కారానికి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాగుదారులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



కంకిపాడు: వాస్తవ సాగుదారులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి, సాగుకు చేయూత అందించాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకం తప్పనిసరి నిబంధన ఎత్తివేయాలని కోరుతూ ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో ఉప్పలూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రంగారావు మాట్లాడుతూ.. కౌలుకార్డులు లేకపోవటంతో కౌలురైతులకు ఆర్థిక చేయూత, సహాయ సహకారాలు అందటం లేదన్నారు. కౌలుకార్డుల జారీ ప్రక్రియను సరళతరం చేసి వాస్తవ సాగుదారులందరికీ కౌలుకార్డులు ఇవ్వాలని కోరారు. కౌలురైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం యోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.చంటి బాబు, దొండపాటి సాంబయ్య, వి.రమేష్, టి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో వైద్య సేవలు పొందండి



పెనమలూరు: కామినేని ఆస్పత్రిలో రాయితీతో అందిస్తున్న వైద్య సేవలు పొందాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కానూరు కామినేని ఆస్పత్రిలో శనివారం పేషెంట్లకు స్పెషల్ ప్రివిలేజ్ కార్డులను ఎమ్మెల్యే ఆవిష్కరించి ప్రసంగించారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కామినేని ఆస్పత్రిలో రాయితీతో వైద్య సేవలు అందించటానికి యాజమాన్యం ముందుకు వచ్చిందన్నారు. కామినేని ఆస్పత్రి క్లస్టర్ హెడ్ పి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. రోగులకు డిస్కౌంట్ ధరలకు వైద్య సేవలతో పాటు మెరుగైన వైద్య సేవలు, మందుల్లో రాయితీ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు పాపారావు, వర్ధన్, వినతి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌కు న్యాక్ అక్రిడేషన్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌కు న్యాక్ బీ ప్లస్, ప్లస్ గ్రేడ్ లభించిందని కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎస్.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ న్యాక్ గ్రేడ్‌తో స్వయం ప్రతిపత్తి గల కళాశాలగా మారటానికి గ్రేడ్ ఉపయోగపడుతుందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి కళాశాల అటానమస్ స్టేటస్ సంపాదించటానికి ప్రయత్నం చేస్తున్నట్లు సెక్రటరీ చెప్పారు. కళాశాలకు ఎంతో ప్రతిష్టాత్మకమైన న్యాక్ అక్రిడేషన్ సంపాదించడంలో భాగస్వాములైన అధ్యాపకులకు, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పెంపకంతో మానవాళి మనుగడ



గన్నవరం రూరల్: మొక్కల పెంపకంతో మానవాళి మనుగడ ఆధారపడి ఉందని కొండపావులూరు గోశాల ప్రేమికులు చెప్పారు. గో సంరక్షణశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు బాధ్యతగా నాటాలని చెప్పారు. తాము గోసేవ ప్రేమికులుగా ఇక్కడ మొక్కలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని చెప్పారు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. మొక్కలు నాటడంతో పాటు రెండు సంవత్సరాల పాటు వాటిని సంరక్షించే భాధ్యతను తీసుకుంటున్నట్లు చెప్పారు. భూమి ఉష్ణోగ్రత తగ్గాలంటే మొక్కలు నాటడం మార్గమన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, విజయవాడ నుంచి వచ్చిన గోసేవ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం



చెరువును తలపిస్తున్న కంకిపాడు బస్టాండ్



కంకిపాడు - గన్నవరం రోడ్డు మార్గంలో నిలిచిన వర్షపునీరు



గొడవర్రులో ఇంటిపై కూలిన వృక్షం

- రెండు నియోజకవర్గాల్లో వీడని ముసురు
- పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీరు

కంకిపాడు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో శనివారం ముసురు వీడలేదు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. మండల కేంద్రమైన కంకిపాడు బస్టాండు ప్రాంగణం చెరువును తలపించింది. రోడ్డు మార్జిన్లలో నీరు నిలిచిపోయి రాకపోకలకు ప్రజలు అవస్థలు పడ్డారు. కంకిపాడు - గన్నవరం రోడ్డు మార్గంలో పునాదిపాడు వద్ద రోడ్డు గోతులమయంగా ఉండటంతో ఆ ప్రాంతంలో వర్షం నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. ముసురుతో కురుస్తున్న వర్షాలకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఖరీఫ్ వరి నాట్లను రైతులు వేగం చేశారు. వరి నారు తీత, నాట్లు పనుల్లో కూలీలు, రైతులు బిజీగా ఉన్నారు.

గొడవర్రులో ఇంటిపై కూలిన చెట్టు..

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి గొడవర్రు గ్రామంలో రేకుల షెడ్డు ఇంటిపై శనివారం తెల్లవారుజామున భారీ వృక్షం కూలింది. చెట్టు విరిగే శబ్దం రావటంతో ఇంటిలో నివాసం ఉంటున్న ప్రొద్దుటూరు కిరణ్ కుటుంబం బయటకు పరుగులు తీశారు. ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. అయితే రేకుల షెడ్డు ధ్వంసమై ఇంటిలో ఉన్న బీరువా, వంట సామగ్రి మొత్తం ధ్వంసమైంది. రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ప్రాథమిక విచారణ పూర్తి చేశారు.

ఈడుపుగల్లు ఎస్సీ కాలనీలో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం

మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం రోజు రోజుకీ క్షీణిస్తోంది. రోడ్లపై మురుగు కదలటం లేదు. విడవకుండా కురుస్తున్న వర్షం నీరు రోడ్లపైనే నిలిచిపోతుంది. దీనికి తోడు పశువ్యర్థాలు రోడ్లపై పారటంతో తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. మురుగులో నడవలేక అవస్థ పడుతున్నారు. పారిశుద్ధ్యం క్షీణించి రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్పీగా రెడ్డి గంగాధర్‌రావు

పశ్చిమ గోదావరికి అద్నాన్ నయీం ఆస్మి బదిలీ



ఎస్పీగా నియమితులైన రెడ్డి గంగాధర్ రావు



పశ్చిమ గోదావరికి బదిలీ అయిన అద్నాన్ నయీం ఆస్మి

సాక్షి, మచిలీపట్నం: జిల్లా ఎస్పీగా రెడ్డి గంగాధర్ రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్పీగా పనిచేస్తున్న అద్నాన్ నయీం ఆస్మి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గంగాధర్‌రావు ప్రస్తుతం సీఐడీలో ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్వస్థలం జిల్లా కేంద్రమైన ఏలూరు. పీజీ పూర్తిచేసిన గంగాధర్ రావు 2004 నుంచి 2007 వరకు ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకుడిగా పనిచేశారు. ఓ వైపు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూనే మరోవైపు గ్రూప్స్‌కు సిద్ధమయ్యారు. 2007లో గ్రూప్–1లో ఉత్తీర్ణులై 2009లో డీఎస్పీ శిక్షణ పూర్తి చేసుకున్నారు. తొలి పోస్టింగ్ అమలాపురంలో, ఆ తరువాత కామారెడ్డి డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది, సీఐడీకి బదిలీ అయ్యారు. ఆ తరువాత ఐపీఎస్ ఖరారు కావడంతో ఏసీబీ జేడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించారు.

ఐదున్నర నెలలు పనిచేసిన ఆస్మి

విజయవాడ ఏసీబీ ఎస్పీగా చేసిన అద్నాన్ నయీం ఆస్మి ఎన్నికల నేపథ్యంలో కృష్ణా జిల్లాకు బదిలీపై వచ్చారు. జనవరి 31వ తేదీన ఇక్కడ విధుల్లో చేరారు. జమ్ము కశ్మీర్‌కు చెందిన ఆయన 2013 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయనను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించగా తొలి పోస్టింగ్ ట్రైనీ ఎస్పీగా కృష్ణా జిల్లాకే వచ్చారు. ట్రైనీలోనే ఏడాది పాటు పనిచేయడంతో జిల్లాపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారు. ఇక్కడ ఎస్పీగా ఐదున్నర నెలలే చేసినా ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నారు. చిత్తశుద్ధితో సాధారణ ఎన్నికల నిర్వహణ, దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు కృషిచేశారు. అర్ధరాత్రి సాధారణ ఫోన్ కాల్ వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకోబోతున్నారనే సమాచారం ద్వారా తెలుసుకొని, కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తంచేసి వారిని కాపాడారు. నిరుద్యోగ యువకుడు ఆత్మహత్య చేసుకోబోతుండగా సెల్ సిగ్నల్ ఆధారంగా అతడిని కాపాడడం వంటి సేవలతో మంచి పేరు తెచ్చుకున్నారు.

నిర్వహణ లోపం.. వాహనదారులకు అసౌకర్యం

- జాతీయ రహదారి, సర్వీసు రోడ్లపై నిలిచి వర్షపు నీరు
- పట్టించుకోని అధికారులు



కంకిపాడు వద్ద జాతీయ బైపాస్ మార్గంలో నిలిచిన వర్షపునీరు



కంకిపాడు సర్వీసురోడ్డులో పరిస్థితి

కంకిపాడు: జాతీయ రహదారుల శాఖ నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. నిర్వహణ లోపమే ప్రధాన కారణమైన అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ అభివృద్ధిలో భాగంగా కంకిపాడు వద్ద బైపాస్ మార్గాన్ని నిర్మించారు. కంకిపాడు ప్రధాన గ్రామంలోకి వెళ్లటానికి వీలుగా, అనుబంధ రహదారులను కలుపుతూ సర్వీసు రోడ్లను అందుబాటులోకి తెచ్చారు.

ప్రమాదాలు నిత్యకృత్యం..

జాతీయ రహదారిపై వర్షం కురిస్తే డ్రెయిన్లలోకి మళ్లే విధంగా జాతీయ రహదారి వెంబడి డ్రెయిన్లను నిర్మించారు. సర్వీసు రోడ్ల మురుగు కూడా మళ్లే విధంగా నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే క్రమం తప్పకుండా వాటిని నిర్వహణ చేసే విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న విమర్శ ఉంది. దీని కారణంగా డ్రెయిన్లలోకి మురుగు వెళ్లే పైపులు పూడుకుపోయి మురుగు, వర్షపునీరు రోడ్లపైనే నిలబడి పోతుంది. ప్రధాన రోడ్డు మార్గంపై వర్షంనీరు నిలిచిపోయి ఉండటంతో వాహనదారులు రాకపోకల సమయంలో అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షపునీరు కదలక, రోడ్డు పాకుడు పట్టి వాహనాలు జారిపడ్డ ఘటనలు అనేకం ఉన్నాయి. బైపాస్ మార్గానికి కంకిపాడు ఒకటో తూము వద్ద, పునాదిపాడు, చెత్త డొంక వద్ద అండర్‌పాస్‌లను నిర్మించారు. ఈ పరిసరాలు కూడా ఇదే దుస్థితి. చిన్న వర్షానికి సైతం నీరు నిలిచిపోయి ఉంటోంది. ప్రజారోగ్యం, వాహనదారుల భద్రత, రాకపోకలను దృష్టిలో ఉంచుకుని అధికారులు రహదారి నిర్వహణపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

చదువుతోనే అసమానతలు రూపుమాపగలం

హనుమాన్‌జంక్షన్ రూరల్: చదువులో రాణించటం ద్వారానే సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను తొలగించగలమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని కాకాని వెంకటరత్నం భవనంలో ఇండెక్స్ ఎడ్యుకేషనల్ టీమ్ ఆధ్వర్యంలో దళిత విద్యార్థుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రతి దళిత విద్యార్థి కనీసం గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇండెక్స్ ఎడ్యుకేషనల్ టీమ్ కృషి చేస్తోందని చెప్పారు. దళిత యువకులు చదువుకు దూరం కావటం వల్ల కూలీలు, కార్మికులుగా జీవనం సాగిస్తున్నారని, చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం గ్రాడ్యుయేషన్ వరకు చదివే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించవచ్చని, స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. అంతేకాక మంచి అలవాట్లు, నాగరికత వైపు పయనించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 200 మంది దళిత విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.50 వేలు నగదు బహుమతులు, అంబేడ్కర్ జీవితచరిత్ర పుస్తకాలు, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు, నోట్‌బుక్స్, కాలేజీ బ్యాగ్స్, లంచ్ బాక్స్‌లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ నిమ్మకూరి కిరణ్‌కుమార్, బొమ్ములూరు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్, ఉపాధ్యాయులు జాన్ మూడి, లింగంపల్లి మురళీ, దళిత నాయకులు మట్టా వరసాయి ప్రసాద్, నిడమర్తి నాగేశ్వరరావు, పింగళి జోజిబాబు, జుజ్జవరపు కృష్ణప్రసాద్, బొకినాల సాంబశివరావు, ఇండెక్స్ ఎడ్యుకేషనల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి అప్పనవీడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



సుజన్ ఇవాంజెలిన్



సాంబశివరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని అప్పనవీడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి శనివారం తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో 580 మార్కులు సాధించిన బల్లారపు సుజన్ ఇవాంజెలిన్ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో, 574 మార్కులు సాధించిన ఎం.సాంబశివరావు ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో సీట్లు సాధించారన్నారు. వీరికి ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చింతా రమాదేవి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సబ్సిడీపై నిత్యావసర సరుకులు సరఫరా చేయాలి



షేక్ చిన్నా

కంకిపాడు: రైతుబజార్ల ద్వారా సబ్సిడీపై నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని సంఘ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చిన్నా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుబజార్లలో సబ్సిడీపై బియ్యం, కంది పప్పు విక్రయాలను చేపట్టిందన్నారు. పెరిగిన నిత్యావసరాలతో పేద, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు భారీగా ఉండటంతో పాటుగా వ్యాపారులు, ఉత్పాదక సంస్థల దోపిడీ పెరిగిందన్నారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు నాణ్యమైన నిత్యావసర సరుకులను రైతుబజారుల్లో అందుబాటులో ఉంచితే పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కల్తీని నివారించి నాణ్యమైన సరుకులు అందించినట్లవుతుందని చెప్పారు. రైతుబజారుతో పాటు రేషన్ దుకాణల ద్వారా సరుకులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

మెగా జాబ్ మేళాలో 156 మందికి ఉద్యోగాలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ విద్యాసంస్థలలో శనివారం జరిగిన మెగా జాబ్ మేళాలో 156 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వికాస్ విద్యాసంస్థల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.కిషోర్ బాబు తెలిపారు. 2022 – 24 మధ్య డిగ్రీ, బీటెక్, బి ఫార్మసీ, డి ఫార్మసి, ఎంబీఏ విద్యార్థులు 512 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కంపెనీల ప్రతినిధులు 156 మంది విద్యార్థులకు తమ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు ప్రకటించారు. వికాస్ విద్యా సంస్థల సెక్రటరీ నరెడ్ల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాలలో తరచూగా మెగా జాబ్ మేళాలను నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు.

తెంపల్లిలో 'ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రామ్'



తెంపల్లిలో ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమం ప్రారంభిస్తున్న మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో శనివారం జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కమ్యూనిటీ హాలులో ఉచిత వైద్య శిబిరం సర్పంచ్ కొలుసు శిరీషా ప్రారంభించారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్ మాట్లాడుతూ.. కళాశాల ఆధ్వర్యంలో అనేక కుటుంబాలను దత్తత తీసుకోవటం ద్వారా వారికి నిరంతరం వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. జాతీయ వైద్య కమిషన్ ప్రజారోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటుందని, దానిలో భాగంగా తెంపల్లిలో వైద్య శిబిరం నిర్వహించి అన్ని రకాల నిపుణులతో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్‌కుమార్, జె.రవికుమార్, భరణి పరుసురాం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో దాడులు.. కేసుల నమోదు

పెనమలూరు: పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన దాడులపై శనివారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. యనమలకుదురు పుట్ట రోడ్డు జీకే రెసిడెన్సీకి చెందిన బత్తిన రామదుర్గకుమార్ వెల్డర్‌గా పని చేస్తాడు. అయితే వారు నివాసం ఉంటున్న రెసిడెన్సీలో భానుచందర్ చెప్పులు దారికి అడ్డుగా ఉన్నాయని రామదుర్గ కుమార్ చెప్పటంతో వివాదం తలెత్తింది. కాగా రామదుర్గకుమార్ సైకిల్‌పై కరకట్ట రోడ్డులో వెళ్తుండగా భానుచందర్, మరి కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వణుకూరులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: వణుకూరు గ్రామంలో కుటుంబ తగాదాల కారణంగా వ్యక్తిపై జరిగిన దాడిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు గ్రామానికి చెందిన నలుకుర్తి రవీంద్ర తహసీల్దార్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్నాడు. గతంలో అతని తండ్రి వీఆర్‌ఏగా పని చేస్తూ మృతి చెంటంతో రవీంద్రకు ఈ ఉద్యోగం ఇచ్చారు. అయితే రవీంద్ర అన్న కుమారుడు నలుకుర్తి శివకు ఉద్యోగం విషయమై రవీంద్రతో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో రవీంద్రపై శివ గొడవపడి దాడి చేశాడు. గాయపడిన రవీంద్రను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితుడి భార్య రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోరంకిలో దాడి

పెనమలూరు: పోరంకి గ్రామంతో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బీజేఆర్ నగర్‌కు చెందిన కందుల చిన్నయ్య డిగ్రీ చదువుతున్నాడు. అతను గ్రామంలో జల్సా బార్ వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన పులిపాక సురేష్ అకారణంగా తగాదా పెట్టుకోని చిన్నయ్యపై కర్రతో దాడి చేశాడు. గాయపడిన చిన్నయ్యను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వీఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ ఎయిర్‌టెక్ యంత్రాలతో రోడ్లను నిరంతరం శుభ్రం చేస్తుండాలని వీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎ.మహేష్ కార్యాలయ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని బెంజిసర్కిల్, గురునానక్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం ఆయన పర్యటించి ఆయా ప్రాంతాలకు చెందిన అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, జోనల్ కమిషనర్‌లకు పారిశుద్ధ్యంపై దిశానిర్దేశం చేశారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా రోడ్ల వెంబడి ఉన్న డ్రెయిన్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు.


ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కాల్వల్లో వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

నున్న(విజయవాడరూరల్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. డ్రైనేజీ కాల్వల్లో వ్యర్థాలు లేకుండా సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు డ్రెయినేజీ కాల్వలు శుభ్రం చేయడం, వర్షం నీరు నిల్వ లేకుండా చూడటం, వాటర్‌ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య చెప్పారు. అనారోగ్య సమస్యలున్నట్లుగా ఎలాంటి సూచనలున్నా వైద్య సిబ్బందితో వైద్య పరీక్షలకు సంబంధించిన సర్వేలు చేయిస్తున్నామన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సర్వేలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలను పంపుతున్నామని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామంలో నెలకు రెండు దఫాలు మెడికల్ ఆఫీసర్ 104 వాహనంతో ప్రజలకు వైద్యసేవలను అందిస్తున్నామని ఎంపీడీఓ చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీని వలన దోమల నివారణ, దోమల వలన వచ్చే వ్యాధులపై అవగాహన వస్తుందని చెప్పారు.

27 నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఈ నెల 27వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలను మైలవరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం విద్యార్థుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తామన్నారు. సిలబస్ మార్పుల వలన 9, 10 తరగతుల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ హాస్టళ్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి టి.కుమారస్వామి, నాయకులు అవినాష్, షణ్ముక్, ప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



భవానీపురం (విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై కళాకారిణులు తమ కూచిపూడి నృత్యాలతో భక్తులను అలరించారు. ప్రతి రోజు నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం విశాఖపట్నానికి చెందిన నాట్య ఝురి సంగీత నృత్యాలయ ఆధ్వర్యంలో నాట్యాచారిణి సాహితి రవళి నేతృత్వంలో వినాయక కౌతం, ఎందరో మహానుభావులు.. కొందరికే వందనములు, బ్రహ్మంజలి.. తాండవ నృత్యకేళి , అఖిలాండేశ్వరీ.. చాముండేశ్వరి, శివాష్టకం, శివతాండవం, శివ స్తుతి, అదివో అల్లదివో శ్రీహరివాసమూ, జగదానందకారక.. జయ జానకి ప్రాణ నాయక, రాజరాజేశ్వరి అష్టకం అంశాలకు పలువురు నర్తకీమణులు నర్తించారు. ఆయా అంశాలకు తగ్గట్లు చక్కని హావభావాలు, ఆహార్యం, అభినయంతో ప్రదర్శించిన సంప్రదాయ కూచిపూడి నృత్యాలు భక్తులను తన్మయులను చేశాయి.